క్లుప్తంగా

దుర్గాదేవికి గాజుల ఉత్సవం



గాజుల అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలో కొలువైన దుర్గాదేవి అమ్మవారికి మాఘ మాసం అష్టమి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి గాజుల ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుమారు 50 వేల గాజులతో విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఎస్వీ పవన్‌కుమార్‌చే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు సేవకులచే ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త ఎరుబండి రామాంజనేయులు, రత్నకుమారి దంపతులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి పటిష్ట బందోబస్తు



డీఎస్పీ జయసూర్య

భీమవరం: మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య చెప్పారు. శుక్రవారం భీమవరంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రధానంగా పట్టణంలో సోమేశ్వర జనార్ధనస్వామి ఆలయం, భీమేశ్వరస్వామి ఆలయంతో పాటు భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోని వివిధ శివాలయాలకు ఈ నెల 26వ తేదిన అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముందన్నారు. ఆలయాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని దైవ దర్శనానికి వచ్చే భక్తులు విలువైన ఆభరణాలు ధరించొద్దని డీఎస్పీ అన్నారు. ఆలయాల వద్దకు వచ్చే వాహనాలను క్రమబద్ధీకరించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని భక్తులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కనుల పండువగా విగ్రహాల ప్రతిష్ఠ



శివుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కాళ్ల: ఓం నమః శివాయ.. హర హర మహాదేవా ! అంటూ కలవపూడి గ్రామం శుక్రవారం శివనామస్మరణతో మార్మోగింది. మండలంలోనలి కలవపూడి గ్రామంలో దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీఉమా భీమేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు పూనుకున్నారు. దీంట్లో భాగంగా గత రెండు వారాలుగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. ఎంతో సుందరంగా నూతనంగా నిర్మించిన ఆలయంలో నూతన విగ్రహాలు ప్రతిష్ఠ, ధ్వజ స్తంభం ప్రతిస్థాపన, కుంభాభిషేకం, శిఖర ప్రతిష్ఠ, శివుని విగ్రహావిష్కరణ కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది. నూతన విగ్రహాలకు వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఉండి ఎమ్మెల్యే, కనుమూరు రఘురామకృష్ణంరాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, జుత్తుగ నాగరాజు, గోకరాజు రామరాజు, నర్సాపురం మున్సిపల్ చైర్మన్ బర్ శ్రీవేంకటరమణ, తదితరులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాలనీ ఇళ్ల నిర్మాణ బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం: పేదలు నిర్మించుకున్న గృహాలకు నిర్మాణ బకాయిలను తక్షణం విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో చింతకాయల బాబురావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రుణ విముక్తి ఉంటుందని భావించిన పేదలకు టీడీపీ ప్రభుత్వం నిరాశనే మిగిల్చిందని గోపాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో నిర్మించిన ఇళ్లకు ఇంటి నిర్మాణ బకాయిలు చెల్లించాలని తెలిపారు. సమావేశంలో కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, పీవీ ప్రతాప్, కర్రా నాగేశ్వరరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, ముచ్చర్ల త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ఇంత నిర్లక్ష్యమా?



గుర్రపుడెక్కతో నిండిపోయిన డ్రెయిన్



చెన్నరంగని పాలెంలో చెత్తాచెదారంతో డ్రెయిన్



ఆర్టీసీ డీపో వెనుక డ్రెయిన్ పరిస్థితి ఇలా

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ప్రజారోగ్యంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. పట్టణంలో డ్రెయిన్ల అభివృద్ధి గురించి మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పట్టణంలో 39 వార్డుల్లోని చిన్న, పెద్ద డ్రెయిన్లు చెత్తాచెదారంతో అధ్వానంగా ఉన్నాయి. కొన్ని డ్రెయిన్లు గుర్రపుడెక్కతో నిండిపోయాయి. మురికి నీళ్లు బయటకు వెళ్లే మార్గం లేక ఎక్కడికక్కడ నిలిపోతున్నాయి. దీంతో దోమలు, దుర్వాసనలతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీకి అనుకుని ఉన్న ఇళ్ల వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దోమల వలన రోగాల పాలవుతున్నారు. పట్టణంలో ఒక్కో డ్రెయిన్ రెండు మూడు వార్డుల మీదగా ఉంటుంది. ఒక్కో వార్డులో 800 నుంచి 1200 ఇళ్ల వరకు ఉంటాయి. ఈ ఇళ్ల నుంచి వాడకం నీరు ఈ డ్రెయిన్ల ద్వారా బయటకు వెళ్లాలి. డ్రెయిన్లు అధ్వానంగా ఉండడంతో ఈ నీరు బయటకు వెళ్లడం లేదు. నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్లు బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఆదాయం అద్భుతంగా ఉన్న మున్సిపాలిటీలో డ్రెయినేజీ వ్యవస్థ తీరు ఇలా ఉంది.

సిల్ట్ తొలగింపు పనులు నిల్

పట్టణంలో డ్రెయిన్లు పూడుకుపోయాయి. దీంతో నీటి ప్రవాహానికి ఆటకం ఏర్పడుతుంది. వాటిలో కనీసం సిల్ట్ తొలగింపు పనులు కూడా మున్సిపల్ అధికారులు చేయడం లేదు. చాలా చోట్ల డ్రెయిన్లు దెబ్బతిన్నాయి వాటికి రివిట్‌మెంట్ నిర్మాణం చేయడం, ఎత్తు పెంచి గోడల నిర్మాణం చేయడం పనులు కూడా చేయడం లేదు. గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు డ్రెయిన్లలో సిల్ట్ తొలగించేవారు. అనేక చోట్ల డ్రెయిన్లు నిర్మించారు. నేడు డ్రెయిన్ల నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేశారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక డ్రెయిన్ నిర్మాణం చేయలేదు. ప్రజల ఆరోగ్యం పట్ల మున్సిపల్ అధికారులకు గాని స్థానిక ప్రజా ప్రతినిధులకు గాని బాధ్యత లేదు. ఇదే భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబుతో పాటు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ నివాసం ఉంటున్నారు. అలాంటి పట్టణంలో పారిశుద్ధ్యం, డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నా పట్టించుకోకపోవడం దారుణం. సమయం దొరికితే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించడం తప్ప భీమవరం పట్టణ అభివృద్ధికి ఇప్పటి వరకు ఇద్దరు ప్రజా ప్రతినిధులు చేసింది ఏమి లేదు.

పారిశుద్ధ్యం మెరుగుపరచండి

సార్ పట్టణ సుందరీకరణ పనులు తరువాత ముందు పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకోండని భీమవరం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్‌ను భీమవరం ప్రజలు అడుగుతున్నారు. పట్టణ ప్రధాన సెంటర్లలో సుందరీకరణ అభివృద్ధి కంటే వార్డులోని సమస్యలు పరిష్కరించడం ముఖ్యం కాదా అని వారు అడుగుతున్నారు. చెత్తాచెదారం, అధ్వానంగా ఉన్న డ్రెయిన్లతో ఇబ్బందులు పడుతున్నామని కాస్త వార్డుల వైపు చూసి సమస్య తీర్చాలని ప్రత్యేక అధికారి జాయింట్ కలెక్టర్‌ను కోరుతున్నారు. మరి జేసీ సార్ ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

మాతృభాషతోనే భావ వ్యక్తీకరణ సాధ్యం



భీమవరం: చంద్రజీని సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది



ఆకివీడు: మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



వీరవాసరం: కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ దాయన సురేష్ చంద్రజీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మనసులోని భావాలను స్పష్టంగా వ్యక్తీకరించగలిగేది మాతృభాషేనన్నారు. తెలుగు భాష ప్రగతి కోసం నాడు నన్నయ నుంచి తిరుపతి వెంకట కవుల వరకు ఎందరో మహనీయులు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. తెలుగు భాష ఉన్నతికి కృషి చేస్తున్న కళాశాల ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్.సతీష్ కుమార్‌రాజు అధ్యక్షతన నిర్వహించిన మాతృభాషా దినోత్సవంలో చంద్రజీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎన్ లక్ష్మి, ఐక్యూ ఏసీ డీన్ ఎస్.రాజేష్, టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎన్.గోపాల కృష్ణమూర్తి, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్ సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషా దినోత్సవంలో వక్తలు

పర భాషలకు నాంది మాతృ భాష

ఆకివీడు: ఏ దేశమేగినా, ఎందుకాలిడినా మాతృభాషను మరవొద్దని ప్రముఖ రచయిత, ఉపాధ్యాయులు పెంకి విజయకుమార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాతృభాషబూ దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని దుంపగడప గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర భాషలను నేర్చుకునేందుకు మాతృభాషను ముందుగా నేర్చుకోవడం ద్వారా పునాది ఏర్పడుతుందన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు హెచ్ఎం ఎస్టీసీ ప్రసాద్, ఉపాధ్యాయులు టీవీఎస్ అనురాధదేవి, తోట శ్రీనివాస్, రమేష్, జి.పద్మజ, ఎం.హేమకుమారి బహుమతులు అందజేశారు.

అచ్చతెలుగులో మాట్లాడండి

ప్రతి విద్యార్థి అచ్చ తెలుగులో మాట్లాడటం నేర్చుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీ నారాయణ (విక్రమ్) పిలుపునిచ్చారు. మండలంలోని అజ్జమూరు గరువులోని ఎంపీపీ స్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, భాషా వారోత్సవాల్లో భాగంగా తెలుగు భాషపై ఆయన విద్యార్థులకు ఉద్బోధించారు. కార్యక్రమంలో నాగ కల్యాణి, ధనలక్ష్మి, శివ, ఏసుకోటయ్య పాల్గొన్నారు.

ఎంఆర్‌కేలో మాతృభాషా దినోత్సవం

వీరవాసరం: స్పష్టమైన భావవ్యక్తీకరణ మాతృభాషతోనే సాధ్యమవుతుందని వీరవాసరం మద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో శుక్రవారం సభా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ భాషైన తెలుగును కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని, తెలుగు భాషలో కృషి చేసిన ఎంతోమంది మహాకవులు, పండితులు మనకు ఆదర్శమని తెలిపారు. సంస్కృత ఉపాధ్యాయుడు డాక్టర్ చిలుకూరి ఫణికుమార్ మాట్లాడుతూ సంస్కృతం అన్ని భాషలకు మూలమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు, సంస్కృతం పాటలు, పద్యాలను, శ్లోకాలను ఆలపించి, తెలుగుభాష వైభవం ప్రతిబింబించే నృత్యాలను ప్రదర్శించి అందరినీ అలరించారు. అనంతరం పద్యపఠన, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని దుర్గా అశ్విని వ్యాఖ్యాతగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో శనివారపు ప్రసాద్, యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, బొల్లా విజయలక్ష్మి, పద్మజారాణీ, భానుకుమారి, రత్నరాజు, అడ్డాల కృష్ణ, రవికుమార్, సత్య శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, పెద్దిరాజు, రాజబాబు, పుష్పలత పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ షాపుల్లో తనిఖీలు

భీమవరం: పట్టణంలోని నాలుగు సెల్‌ఫోన్ షాపుల్లో యాపిల్ లోగోతో నకిలీ సెల్‌ఫోన్లు విక్రయిస్తున్నట్లు యాపిల్ సంస్థ ప్రతినిధి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం దాడులు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు శుక్రవారం చెప్పారు. పట్టణంలోని మెంటేవారితోట బైపాస్‌రోడ్డు, పీపీరోడ్డు, రేమండ్స్ షోరూమ్ వద్ద గల మరో షాపు, రెస్ట్‌హౌస్‌రోడ్డులోని షాపుల్లో తనిఖీలు నిర్వహించి యాక్సరీస్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

తల్లిదండ్రులే ఆది గురువులు



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని సత్కరించిన చైర్‌పర్సన్

ఆకివీడు: విద్యార్థులకు తల్లిదండ్రులే ఆది గురువులని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. స్థానిక విజ్ఞాన స్కూల్‌లో శుక్రవారం మండల స్థాయి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినిని ఆమె సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. కమిషనర్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియా, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. వైస్‌చైర్మన్ పుప్పాల పండు మాట్లాడుతూ క్రమ శిక్షణతో ఇష్టంగా చదివిన చదువే మీ జీవితానికి ఉపయోగపడుతుందన్నారు. కరస్పాండెంట్ వైఎన్‌వీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పథకాల తనిఖీ



నీటిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి నాగేశ్వరరావు

పాలకోడేరు: శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శృంగవృక్షం రీసర్వే గ్రామ సభకు వచ్చిన సందర్భంలో స్థానిక మహిళలు తాగునీటి సరఫరా సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. వెంటనే కలెక్టర్ స్పందిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ పథకాలను పరిశీలించి నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించడంతో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బీవీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంబంధిత శాఖ అధికారులు శృంగవృక్షం గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరా పథకాలను శుక్రవారం పరిశీలించి, నీటి నాణ్యతా ప్రమాణాలు పరీక్షించి క్లోరినేషన్ మోతాదు పెంచాలని, కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ పార్వతి, సర్పంచ్ జంగం సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి ఎ.కోదండరామయ్య పాల్గొన్నారు.

ఎలుకలను సామూహికంగా మట్టుబెట్టాలి



ఆకివీడులో ఎలుకల మందు తయారీ కార్యక్రమం



ఉండిలో ఎలుకల మందు పంపిణీ చేస్తున్న దృశ్యం



భీమవరం అర్బన్: పంపిణీకి సిద్ధం చేస్తున్న ఎలుకల మందు

ఆకివీడు: దిగుబడులకు గుది బండగా ఎలుకల దండయాత్ర ఉందని వాటిని సామూహికంగా మట్టుబెట్టాలని వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక చెప్పారు. మండలంలోని కోళ్లపర్రు గ్రామంలో శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన మందును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం అన్ని గ్రామాల్లోని వరి చేల వద్ద బొరియలను మూసి వేశారన్నారు. శనివారం తెరిచి ఉన్న బొరియలను గుర్తించి వాటి వద్ద బ్రోమోడయోల్ మందును ఉంచాలని ఆమె సూచించారు. రైతులు ఎలుకల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

ఉండిలో..

ఉండి గ్రామంలోని ఆర్‌ఎస్కే వద్ద శుక్రవారం ఎలుకల మందు పంపిణీని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడితే నష్టాల నుంచి అధిగమించొచ్చన్నారు. మందును రైతులు సామూహికంగా పొలం బొరియల వద్ద వినియోగించాలన్నారు. మండల వ్యవసాయాధికారిణి బి.సంధ్య మాట్లాడుతూ బంజరు భూములు, కాలువ గట్లు, చెరువు గట్లు, రోడ్ల పక్కన, ఇతర వ్యవసాయేతర భూముల్లో కూడా బ్రోమోడయోల్ మందును ఎలుకల నిర్మూలనకు వినియోగించడం ద్వారా ఎలుకల ఉధృతి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడేరులో

పాలకోడేరు: మండలంలోని అన్ని గ్రామాలల్లో శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించిన్నట్లు మండలం వ్యవసాయ అధికారి వి.నారాయణరావు తెలిపారు. ఇందులో భాగంగా శృంగవృక్షం గ్రామంలో రీ సర్వేపై నిర్వహించిన గ్రామ సభకు హాజరైన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొనగా గ్రామసభ అనంతరం రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలనకు విషపు ఎర తయారీ, పంపిణీ కార్యక్రమం కలెక్టర్ సమక్షంలో పంపిణీ చేశామని ఏవో తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవోరాకేష్ కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.భారతీవిజయలక్ష్మి, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంట దిగుబడిపై ప్రభావం

భీమవరం అర్బన్: పంట చేలల్లో ఎలుకలు వరి దుబ్బులను కొరికి చేనును నాశనం చేయడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలో యనమదుర్రు గ్రామంలో శుక్రవారం నూకలు, నూనెతో కలిపిన ఎలుకల మందును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంలో ఎలుకలను నిర్మూలించకపోతే పంటపై తీవ్ర చూపుతాయన్నారు. సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, వీఏఏ వంశీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనార్థం గ్రామ సభలు

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

పాలకోడేరు: రైతులకు ఆమోదయోగ్యమైన భూముల రీ సర్వే చేపట్టేందుకే గ్రామ సభలను నిర్వహిస్తున్నాదమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో శుక్రవారం భూముల రీ సర్వేలో లోటుపాట్లను తెలుసుకునేందుకు గ్రామస్తులతో ఏర్పాటు చేసిన గ్రామసభలో కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో పాటు కలెక్టర్ కూడా నేల మీద బరకంపై కూర్చుని గ్రామసభను నిర్వహించి రైతుల నుంచ సమస్యలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రైతులతో మాట్లాడుతూ రైతులకు భూ సమస్యలు లేకుండా చక్కటి పరిష్కార మార్గాన్ని అందించేందుకే రీ సర్వేను చేపట్టామన్నారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించి అపోహలకు తావులేని వాస్తవ రికార్డులను రూపొందించడమే లక్ష్యం అన్నారు. ప్రతి మండలంలోని ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి తొలుత రీ సర్వేను ప్రారంభించారన్నారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో గత 15 రోజులుగా రీ సర్వే నిర్వహిస్తున్నారని వాస్తవ భూమి లెక్కలు నిర్ధారించుకున్న అనంతరం వ్యక్తిగతంగా భూముల కొలతలను రైతుల సమక్షంలోనే నిర్వహిస్తామన్నారు. అలాగే రీ సర్వేలో ఉత్పన్నమయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ప్రతి మండలానికి ఒక రీసర్వే డీటీని నియమించామన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 20 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. మొత్తం 37 వేల ఎకరాలను సర్వే చేయవలసి ఉండగా, ఇప్పటి వరకు 22 వేల ఎకరాలు సర్వే పూర్తి చేశారన్నారు. 24 వేల మంది రైతులు ఉండగా 15 వేల మంది రైతులకు ఇప్పటికే నోటీసులు అందజేసి సర్వేకు హాజరు కావలసిందిగా కోరామన్నారు.తొలుత పలువురు రైతులు రీ సర్వేలో భాగంగా తలెత్తుతున్న సమస్యలను, సందేహాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, వెంటనే జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సందేహాలను నివృత్తి చేసి, సమస్యలు లేకుండా రీ సర్వేని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహసీల్దార్ ఎస్.భారతీ విజయలక్ష్మి, సర్పంచ్ జంగం సూరిబాబు, ఎంపీటీసీ ఎస్.సత్యకృష్ణ, కలిదిండి కృష్ణంరాజు, రామకృష్ణంరాజు, సర్వే డీటీలు, సచివాలయ సిబ్బంది, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి



వాల్‌మార్ట్ మేనేజర్ దేవానంద్ గురుప్రసాద్‌ను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

భీమవరం: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని అంతర్జాతీయ సంస్థ వాల్‌మార్ట్ మేనేజర్ సీహెచ్ దేవానంద్ గురుప్రసాద్ స్పష్టం చేశారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే నిపుణ 25 జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియంలో శుక్రవారం అయన ముఖ్య పాల్గొని మాట్లాడారు. తాను విద్యార్థి దశలో ఐఎస్‌టీఈ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోగలిగానన్నారు. ప్రతి విద్యార్థి తనలోని బలహీనతలు గమనించి వాటిని ఏ విధంగా అధిగమిస్తే లక్ష్యాన్ని చేరుకోగలమో ఆలోచించాలని విద్యార్థులకు హితవు చెప్పారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలను ప్రస్తుత విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అప్పుడే ఉన్నత శిఖరాలు అందుకోగలరన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు సింపోజియం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఐఎస్‌టీఈ విద్యార్థి చాప్టర్ ఫ్యాకల్టీ అడ్వైజర్ ఎస్.రామ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వరుసగా రెండుసార్లు తమ కళాశాల ఐఎస్‌టీఈ విభాగం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌టీఈ చైర్‌పర్సన్ పి.శ్రీధర్, వి.పవన్‌సాయి నాగేంద్ర, ఎస్.కై వల్య, పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాలో 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు పని చేస్తున్నాయని. వీటిలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది సేవలందిస్తున్నారన్నారు. అలాగే వీరితో పాటు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉండి ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. గర్భిణులకు వైద్య సేవలు, టీకాలు, సాధారణ ప్రసవాలు నిర్వహించడం, బాలింత సేవలతో పాటు అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి 16 సంవత్సరాల వయస్సు వారికి వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి ప్రతి నెలా మెరుగైన సేవలు అందించి ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వైద్య సేవలు పొందేందుకు కృషి చేయాలన్నారు.